నేడు జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టులలో 13 ఉదయం 10:30 నుండి సాయంత్రం 5:00 గంటల వరకు 'జాతీయ లోక్ అదాలత్' నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. కడపలో 4, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో3, రాయచోటిలో3, బద్వేల్‌లో 2, సిద్ధవటం, మైదుకూరు, కమలాపురం, పులివెందుల, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లి, నందలూరు, రైల్వే కోడూరులలో ఒకొక్కటి చొప్పున ఏర్పాటు చేశామన్నారు. పూర్తి సమాచారం కోసం 08562- 258622, 244622లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ఏచూరి ఆశయాలను కొనసాగిద్దాం

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్



కడప అర్బన్ : సీతారాం ఏచూరిపై ప్రచురించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

సామాజిక న్యాయం, సమానత్వం, సోషలిజం లక్ష్యంగా సీతారాం ఏచూరి పని చేశారని, ఆయన కృషిని కొనసాగించడమే నిజమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏచూరి మొదటి వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి సిపిఎం అఖిల భారత కార్యదర్శిగా, పార్లమెంటులో సిపిఎం పక్ష నాయకులుగా భారతీయ సమాజంలోని వైరుధ్యాలను మార్క్సిస్టు శాస్త్రీయ దృక్పథంతో విశ్లేషించి, భిన్నత్వంలో ఏకత్వం భారతీయ భావనకు మాత్రమే దేశ ప్రజల మద్దతు ఉంటుందని ధైర్యంగా తన రచనలు కొనసాగించిన మహోన్నత ప్రజా అనుకూల మేధావి అన్నారు. ఏడు దశాబ్దాలు విలువలతో కూడిన జీవితాన్ని కొనసాగించి, క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు దిగ్గజం అని కొనియాడారు. ప్రజల నిత్య జీవిత అనుభవం నుంచి పోరాటాలు, ఐక్య ఉద్యమాలు వస్తాయని ప్రధానంగా నమ్మిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.అన్వేష్, కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, నగర నాయకులు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, విజయ్, రఘు, ఒంటిమిట్ట మండల కార్యదర్శి నరసయ్య పాల్గొన్నారు. **ఎల్ఐసి ఆధ్వర్యంలో..** సీతారాం ఏచూరి, జ్యోతిబసు, హరికిషన్ సింగ్ సుర్జిత్ లాంటి భవిష్యత్ దర్శనం చేయగలిగిన నాయకులు లేకపోవడం దేశానికి తీవ్రమైన లోటు అని బీమా ఉద్యోగుల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో శుక్రవారం సీతారాం ఏచూరి తొలి వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అక్బర్ బాషా, ఇతర నాయకులు అమీనా పర్వీన్, శశికళ, రాజు, కుమార్, హనుమ, సాదక్, గౌస్, శ్రీనివాసులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** సీతారాం ఏచూరి ఆశయాలతో ముందుకు సాగాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఏసుదాసు తెలిపారు. శుక్రవారం స్థానిక సిపిఎం స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలతో నివాళులర్పించారు. కార్మిక వర్గ పక్షపాతి పీడిత ప్రజల ప్రియతమ నేత సీతారాం ఏచూరి అని ఆయన అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దేశవ్యాప్తంగా అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం సభ్యులు ఎ. వినయ్ కుమార్, ప్రసాద్, మధు, శేఖర్ , ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. **అట్లూరు :** స్థానిక సిపిఎం కార్యాలయంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి .చాంద్‌బాషా ,సిపిఎం పార్టీ అట్లూరు మండల కార్యదర్శి ఇ .రమణయ్య మాట్లాడుతూ సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమన్నారు ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు జైలుకు కూడా వెళ్లారని ఆయన తెలిపారు. జాతీయస్థాయిలో సుందరయ్య తర్వాత రెండో వ్యక్తి సీతారాం ఏచూరి అని ఆయన తెలిపారు. విద్యార్థుల బోధన రీసెర్చ్ కోసం తన పార్థివదేహాన్ని కూడా ఎయిమ్స్ మెడికల్ ఆస్పత్రికి తమ కుటుంబ సభ్యులు అప్పజెప్పారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల సిపిఎం కమిటీ సభ్యులు దుర్గమ్మ, స్వప్న, సరస్వతి, ఆదిలక్ష్మమ్మ, రవిచంద్ర, గోపయ్య, రామసుబ్బయ్య, నాయకులు మారయ్య, జీవన్ కుమార్, వెంకటసుబ్బమ్మ, గంగాదేవి , మునెమ్మ, అచ్చమ్మ, లక్ష్మీదేవి, ఐవారమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు **మైలవరం (జమ్మలమడుగు రూరల్) :** సీతారాం ఏచూరి జీవితం నేటి తరానికి ఆదర్శమని సిపిఎం మండల నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా మైలవరంలో సిపిఎం ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారాయణ మాట్లాడుతూ కార్మిక వర్గ పక్షపాతి పీడిత ప్రజల ప్రియతమ నేత సీతారాం ఏచూరి అని ఆయన అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం దేశవ్యాప్తంగా అనేక ఆందోళన పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి అని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కొండయ్య, కృష్ణ, నారాయణ, మోహన్ పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** కార్మిక సమస్యల పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని సిఐటియు పులివెందుల కార్యదర్శి గఫూర్ అన్నారు. శుక్రవారం సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా గఫూర్ డ్రైవింగ్ స్కూల్‌లో చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యుక్త వయసులోనే కార్మిక కర్షకుల పీడిత ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన వారిలో మొదటి వ్యక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఢిల్లీ వరకు విద్యార్థి ఉద్యమాలలో ఉద్యమాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. దేశ ప్రపంచ రాజకీయాల్లో దేశ ఆర్థిక వ్యవస్థను విధానాలపై విశ్లేషణ సభ్యుడిగా సేవలందించిన నాయకుడు సీతారాం ఏచూరి ఆయన ఉద్యమాలు నేటి యువతకు ఆదర్శనీయమని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు చిన్న నరసింహులు, నారాయణరెడ్డి పాల్గొన్నారు. **పోరుమామిళ్లలో :** స్థానిక అంబేద్కర్ భవనంలో సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సిపిఎం ఆధ్వర్యంలో ఆయన ఫొటోకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఎన్. భైరవప్రసాదు మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆలు పెరగని ఎర్రజెండా వీరుడని, ఎర్రజెండా పోరాటానికి స్ఫూర్తిదాత అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం పోరుమామిళ్ల మండల కమిటీ సభ్యులు బిబి, కుసులూరు రవి, బాబు, చిన్నయ్య, గురయ్య, రమణయ్య, రాజశేఖర్, వళి, సాయి, వెంకటమ్మ పాల్గొన్నారు **ప్రొద్దుటూరు :** బలహీన వర్గాల కోసం నిత్యం పోరాడిన మనిషి సీతారాం ఏచూరి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ అన్నారు. సీతారాం ఏచూరి మొదటి వర్ధంతిని స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు.సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రజలు, కార్మికుల కోసం నిరంతరం పనిచేసిన వ్యక్తి అన్నారు. ఇండియా కూటమి బలపడడానికి ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సిఐటియు నాయకులు విజయకుమార్, సాల్మన్, వెంకటసుబ్బయ్య అంగన్వాడి యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి ,మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు ఐ ఎన్ సుబ్బమ్మ ,రాములమ్మ డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, రవితేజ పాల్గొన్నారు.



అట్లూరు : సీతారాం ఏచూరి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అక్రమాలపై విచారించాలని వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా ఆర్‌సిఎం రాయలసీమ డయాసిస్ ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీలో అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని, సంబంధిత అధికారుల అవినీతిపై విచారణ జరిపి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. శుక్రవారం విజయవాడ మంగళగిరి లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో విద్యా శాఖ డైరెక్టర్ పార్వతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఆర్‌సిఎం ఎయిడెడ్ పాఠశాలలో అక్రమ పద్ధతిలో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారని పేర్కొన్నారు. మూతబడిన పాఠశాలలను విద్యార్థుల ఉన్నట్లు చూపి పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ఉద్యోగం ఒక చోట అయితే మరొక చోట పని చేస్తున్నారని చెప్పారు. ఇందులో కడప జిల్లా విద్యా శాఖ అధికారుల హస్తం కూడా ఉన్నదని ప్రచారం జోరుగా సాగుతోందని పేర్కొన్నారు. కోట్ల రూపాయలు చేతులు మారాయని చెప్పారు. తక్షణమే ఆర్‌సిఎం ఎయిడెడ్ స్కూల్స్ ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో అవినీతి పై సమగ్ర విచారణ చేప ట్టాలని డిమాండ్ చేశారు. అందుకు సహకరించిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ.నరసింహులు, మాజీ నాయకులు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం : మండలంలోని భాకరాపేట గ్రామానికి చెందిన డొళ్ల నారాయణ (56) అప్పుల బాధతో మృతి చెందాడు. మృతుడు ఏడాది కిందట తను జీవనం కోసం మేపుకున్న 80 గొర్రెలను ఇటుకల పాడు గ్రామంలోని ఒకరికి రూ.7.60 లక్షలకు విక్రయించాడు. డబ్బులు కోసం వెళ్లగా 'నా వద్ద డబ్బులు లేదు ఇప్పుడు ఇవ్వలేను' అని చెప్పడంతో నారాయణ ఆందోళనకు గురయ్యాడు. ఈలోగా గొర్రెలు మేపేందుకు చేసిన అప్పులు అధికం కావడంతో మనస్థాపానికి గురైన అతను బుధవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అతన్ని వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య సరస్వతి, ముగ్గురు పిల్లలున్నారు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. **విచారణ జరిపించాలి ..** సిపిఎం డొళ్ల నారాయణ ఆత్మహత్యకు కారణమైన వారిపై విచారించి చర్యలు తీసుకోవాలి సిపిఎం ండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ అన్నారు. బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించారు. నారాయణ గొర్రె లను అమ్మినా డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నారాయణ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతుడి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రూ.11 లక్షలతో కెమికల్ ఫ్యాక్టరీ ఉద్యోగి పరారీ

ప్రజాశక్తి - ముద్దనూరు : పులివెందుల రహదారిలోని పెద్ద దుద్యాల సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలో వెహికల్ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న ప్రదీప్ కుమార్ ఫ్యాక్టరీ డబ్బులు దోచుకుని పరారయ్యాడు. సిఐ దస్తగిరి తెలిపిన వివరాల ప్రకారం కెమికల్ ఫ్యాక్టరీలో ప్రదీప్ కుమార్ మూడేళ్లకు పైగా వెహికల్ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వహిస్తున్నారు .లారీల నిర్వహణ కోసమని ఫ్యాక్టరీ యజమాన్యం ఆన్‌లైన్ ద్వారా ప్రదీప్ కుమార్ ఖాతాలో రూ11 లక్షలు నగదు జమ చేసింది. ఆ డబ్బులు కాజేసి పరారయ్యాడని, ఫ్యాక్టరీ యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సిఐ తెలిపారు.

రణభేరిని విజయవంతం చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-చెన్నూరు

ఈ నెల 15న నిర్వహించే రణభేరిని విజయవంతం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద రణభేరికి సంబంధించిన కరపత్రాలను యుటిఎఫ్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజా మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగా, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం లోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో మూడేళ్లపాటు పోరుబాట నిర్వహించామని చెప్పారు. అయినప్పటికీ స్పందించకపోవడంతో తగిన మూల్యం చెల్లించుకుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలల కాలం గడిచిపోయినా ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ఏమాత్రం చొరవ చూపకపోవడం తగదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్థిక బకాయిలన్నీ చెల్లిస్తారని, పిఆర్‌సి కమిటీ వేస్తారని ఐఆర్ 30 శాతం చెల్లిస్తారని ఆశించిన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు భంగపాటు తప్ప మరొకటి లేదన్నారు. విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ అన్ని రకాల పెన్షన్ బెనిఫిట్స్ ఇస్తారని ఆశించిన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు నిరాశ మిగిలింది అన్నారు. యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా రణభేరి కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ రాయలసీమ రణభేరి కార్యక్రమం ఈనెల 15న కర్నూలు నుండి ప్రారంభమై 19న నంద్యాలలో ముగుస్తుందని తెలిపారు. కడప జిల్లాలో 18న కడప నుండి ప్రారంభమై మైదుకూరులో ముగుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సీనియర్ నాయకులు వెంకటసుబ్బయ్య మండల అధ్యక్షుడు నాగిరెడ్డి జాన విజయ భాస్కర్ జయరాజ్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్వాడీ టీచర్ మృతి

- నివాళులర్పించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

రాజుపాలెం మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన అంగన్వాడీ టీచర్ పెరుగు సరస్వతికి (38) అనారోగ్యంతో మృతిచెందారు. శుక్రవారం సిఐటియు నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, సిఐటియు జిల్లా కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ చిన్న వయసులో చనిపోవడం బాధాకరమన్నారు. ఎంతోమంది చిన్నపిల్లలకు పౌష్టికాహారం అందించి చిన్నపిల్లల ప్రాణాలను కాపాడుతూ ఆమె ప్రాణాలు వదిలారని చెప్పారు. ఆమె మృతి అందరినీ కలచివేసింది అన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సత్యనారాయణ, విజయ్ కుమార్, సాల్మన్, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్ పాల్గొన్నారు

మట్టి ఖర్చులు కరువాయే : సిఐటియు

కడప అర్బన్ : చనిపోయిన అంగన్వాడీలకు ఆ రోజే మట్టి ఖర్చులకోసం రూ.15 వేల ఇవ్వాలని జీవో ఎంఎస్ నంబర్ 119 రాష్ట్ర ప్రభుత్వం జారీచేసినప్పటికీ, ఐసిడిఎస్ అధికారులు చనిపోయిన వారికి మట్టి ఖర్చుల డబ్బులు ఇవ్వకపోవడం బాధాకరమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, జిల్లా కార్యదర్శులు సత్యం, సుబ్బయ్య, అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లక్ష్మి దేవి, బి.లక్ష్మీదేవి, పొద్దుటూరు ప్రాజెక్టు కార్యదర్శి సుబ్బలక్ష్మి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు నియోజకవర్గం రాజుపాలెం మండలం ఉప్పలపాడు అంగన్వాడి సెంటర్లో కార్యకర్తగా పనిచేస్తున్న సరస్వతి చనిపోయారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వెంటనే మట్టి ఖర్చులు కూడా ఐసిడిఎస్ సిడిపిఒ ఇవ్వకపోవడం బాధాకరమైన పేర్కొన్నారు. అడిగితే డబ్బులు వచ్చినప్పుడు ఇస్తామని చెప్పడం సరికాదని తెలిపారు. కడప ఐసిడిఎస్ జిల్లా అధికారులు వెంటనే స్పందించి మట్టి ఖర్చుల డబ్బులు ఇచ్చే విధంగా చూడాలని తెలిపారు.

భూ సమస్యల ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

- ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

ప్రజాశక్తి - కడప అర్బన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్

భూ సంబంధిత అర్జీదారులు, ఫిర్యాదుదారుల పట్ల భాధ్యతాయుతంగా, త్వరితగతిన స్పందించగలిగినపుడే వందశాతం రెవెన్యూ సమస్యలు పరిష్కరించగలమని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సభాభవన్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పెండెన్సీపై ఆమె డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, చిన్నయ్య, సర్వే ల్యాండ్స్ ఏడీ మురళీ కృష్ణతో కలిసి సిఎంఒ కార్యాలయం నుంచి అందిన కాల్స్ మేరకు ఆయా డివిజన్ల ఆర్‌డిఒలు, అన్ని మండలాల తహశీల్దార్లు, ఆర్ఐలు, ఎంపిడిఒలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిజిఆర్ఎస్ వ్యవస్థ నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తోందన్నారు. ముఖ్యంగా, ప్రభుత్వ సేవలు, రెవెన్యూ అంశాలు, పిఒటి యాక్ట్ ప్రకారం అసైన్డ్ భూముల పరిష్కారంలో ఎక్కువగా ఫిర్యాదులు అందుతున్నాయని, వచ్చిన ఫిర్యాదులకు సరైన పరిష్కార నివేదికలు కూడా అందడం లేదన్నారు. అలాగే సెక్షన్ 22-ఎ డెలిషన్ సంబంధిత మండల తహశీల్దార్లు క్షేత్రస్థాయిలో ఫిర్యాదుల పట్ల విచారణ చేయాలని చెప్పారు. ప్రభుత్వం ద్వారా మనం చేసే ప్రతి పనీ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులకు మంచి పేరు వచ్చేలా చేపట్టాలన్నారు. అనంతరం ఆయా శాఖల వారీగా ఫిర్యాదుల పెండింగ్‌పై సమీక్షించారు. రెవెన్యూ శాఖలో ఫిర్యాదుల పెండెన్సీ నమోదుకు వచ్చే నెల లోపు '0' స్థాయికి వచ్చేలా... పునఃపరిశీలించి ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. మండల స్థాయి అధికారులతో ప్రతివారం, జిల్లా స్థాయిలో 15 రోజులకు ఒకసారి పెండెన్సీని పూరించేందుకు సమీక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. డిఆర్ఒ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విధి నిర్వహణలో వర్చువల్ గవర్నెన్స్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి విజిట్‌కు వెళ్లేముందు ముందస్తు ప్రణాళికతో వెళ్లాలని, అవసరమనుకున్న చోట ఆకస్మిక తనిఖీలు కూడా నిర్వహించాలని తద్వారా మంచి ఫలితాలను అందుకోగలం అన్నారు. కార్యక్రమంలో నాలుగు రెవెన్యూ డివిజన్లకు చెందిన తహశీల్దార్లు, ఆర్ఐలు, సంబంధిత శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.



దుకాణం ముందు యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

యూరియా కోసం అగచాట్లు

ప్రజాశక్తి- ఖాజీపేట

ఖరీఫ్ సీజన్ పై అధికారులకు ముందు చూపు లేకపోవడం, రైతుల అవసరాలను అంచనా వేయలేకపోవడం వంటి ఆనేక కారణాల వల్ల యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి కష్టాలు పడాల్సి వస్తుందని రైతులు తీవ్రంగా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. మండల పరిధిలోని తవ్వారు పల్లె రైతు సేవా కేంద్రంలో శుక్రవారం యూరియా కోసం రైతులు పెద్ద ఎత్తున గూమికూడారు. స్టాక్ అందుబాటులో లేకపోవడంతో మరికొందరు రైతులు వెనుతిరిగి వెళ్లారు. రైతుల అవసరాలకు తగ్గట్టుగా ప్రభుత్వం మంజూరు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తపరిచారు. ప్రభుత్వం ఆరకొరగా యూరియాను సరఫరా చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు కొందరు వ్యవసాయ సహాయ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. పోలీసులు జోక్యం కలగజేసుకొని రైతులను శాంతింప చేశారు. ప్రభుత్వం స్పందించి తగినంత యూరియాను రైతులుకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

బస్తా రూ.350 చెల్లించినా దొరకని యూరియా

చాపాడు : యూరియా కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. బహిరంగ మార్కెట్లో బస్తా రూ. 350 చెల్లించినప్పటికీ దొరకడం కష్టంగా మారుతుంది. ప్రయివేట్ దుకాణాల యజమానులు రూ.350తో అమ్మకాలు చేపడుతున్నారు. అది కూడా వారికి ఇష్టం వచ్చిన వారికి మాత్రమే పంపిణీ చేస్తున్నారు. యూరియా బస్తా కోసం గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. శుక్రవారం సోమాపురం రైతు సేవా కేంద్రంలో యూరియా పంపిణీ చేస్తారని రైతులు ఉదయం నుంచి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. యూరియా కోసం రైతులు ఆందోళన చేయడంతో వ్యవసాయ అధికారి దేవి పద్మలత పరిస్థితిని చక్కదిద్ది యూరియా పంపిణీ చేశారు. చాపాడులోని ప్రయివేట్ దుకాణంలో బస్తా రూ.350తో అమ్మకాలు చేపట్టారు రైతుల నుంచి అధికారులకు అభ్యంతరాలు వెళ్లడంతో పంపిణీ నిలుపుదల చేశారు. రెండు మూడు రోజుల్లో అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ చేపడతామని రైతులు అవసరం మేరకు మాత్రమే యూరియాను ఉపయోగించాలని ఎఒ తెలిపారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్ : నగరంలోని హోటల్, రెస్టారెంట్ నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ హరిత సూచించారు. శుక్రవారం నగరంలోని మురళీ హాల్ సమీపంలో ఉన్న సౌజన్య హోటల్ లో ఆహార నాణ్యత బాగోలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. హోటల్‌లోని భవన సామర్థ్యం, ఆహార తయారీ నియమాలు, కస్టమర్లకు అందిస్తున్న సేవలపై క్షుణ్ణంగా తనిఖీ చేశారు. బిల్డింగ్ ప్రమాణాలు బాగోలేకపోవడం, శుభ్రత లోపించడం పట్ల నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. 15 రోజుల లోపు సరిచేసుకోకపోతే చర్యలు తప్పవని నోటీసులు అందజేశారు. ఇలాంటి ఘటనలపై తమకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సాయిబాబా స్కూల్లో వెజిటబుల్స్ డే

ప్రజాశక్తి - కడప అర్బన్ : అక్కాయపల్లెలోని సాయిబాబా ప్రైమరీ స్కూల్లో శుక్రవారం ఘనంగా వెజిటేబుల్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సాయి సుధీర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వెజిటబుల్స్ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియ జేసేందుకు కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. కూరగాయలలో ఎలాంటి విటమిన్స్ ఉంటాయో విద్యార్థులకు వివరించామని చెప్పారు. వివిధ కూరగాయల రూపంలో విద్యార్థుల ప్రదర్శన తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిఇఒ ఎం.వి.శ్రీదేవి, ప్రైమరీ స్కూల్ ఇన్‌ఛార్జి ఉమాదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ భాష హిందీకి ప్రాముఖ్యత అవసరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : భారత రాజ్యాంగంలో హిందీని అధికార భాషగా స్వీకరించిన రోజు సెప్టెంబర్ 12 అని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్, జిల్లా మేధావి సమాఖ్య అధ్యక్షుడు వివేకానంద రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 14న భారత రాజ్యాంగ సభ హిందీని దేశ అధికార భాషగా గుర్తించిన రోజును పురస్కరించుకుని పాఠశాలలో హిందీ దివాస్ నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షతన ఈ తీర్మానం ఆమోదించాలని పేర్కొన్నారు. హిందీ భాష ప్రాముఖ్యతను గుర్తుచేయడం, అధికారిక పనుల్లో హిందీ వినియోగాన్ని ప్రోత్సహించడమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, సునీత, సరస్వతీ దేవి పాల్గొన్నారు.

ఉల్లి కొనుగోలుకు చర్యలు

ప్రజాశక్తి - కడప : జిల్లాలో పండించిన ఉల్లి పంటను రైతులకు నష్టం వాటిల్లకుండా ఎపి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతోందని ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు ఎపి మార్క్ ఫెడ్ ద్వారా రైతుల నుంచి నేరుగా ప్రభుత్వం చేపడుతున్న ఉల్లి పంట కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ఉల్లి రైతులు, ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేసి, వారి నుండి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె ఇప్పటికే ప్రారంభమైన మైదుకూరు, కమలాపురం ఉల్లి కొనుగోలు కేంద్రాలను ఆయా ప్రాంత ఉల్లి రైతులు సద్వినియోగం చేసుకునేందుకు అన్నిరకాల సదుపాయాలను కల్పించామన్నారు. జిల్లా లోని చాలా ప్రాంతాల్లో ఇంకా ఉల్లి పంట కోతకు సిద్ధంగా ఉందని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట దిగుబడిని ఎలా సంరక్షించుకోవాలి?, ఒక్కసారిగా అధిక పంట యార్డులకు చేరితే దాన్ని ఎలా మార్కెటింగ్ చేయాలి ? అనే అంశాలను రైతులు, ట్రేడర్లతో చర్చిస్తున్నామని చెప్పారు.

కారుణ్య నియామకాలు చేపట్టకపోతే ఆందోళన

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరపాలక సంస్థలో శానిటేషన్, ఇంజనీరింగ్ సెక్షన్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టకపోతే ఆందోళన బాట పడతామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ హెచ్చరించారు. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య, ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేస్తూ మృతి చెందిన కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శానిటేషన్‌లో ఆరుగురు, ఇంజనీరింగ్ సెక్షన్‌లో ముగ్గురు కార్మికులు మృతిచెందారని చెప్పారు. మూడు సంవత్సరాల నుంచి మృతుల కుటుంబాల్లో ఎవరికి ఉద్యోగం ఇవ్వకపోవడంతో వారి జీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ కొంతమందికి ఉద్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎనిమిది కార్పొరేషన్లు, 110 మున్సిపాలిటీలలో మృతిచెందిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. కడప కార్పొరేషన్‌లో మాత్రం కమిషనర్ మనోజ్ రెడ్డి రోస్టర్ ప్రకారం ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. స్టాండింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశంలో ఉద్యోగాలు ఇవ్వాలని తీర్మానం చేసిన ఎమ్మెల్యే మాధవి చెప్పిన మృతుల కుటుంబాలకు న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరంతా ఆప్కాస్‌లో పనిచేస్తున్న కార్మికులేనని తెలిపారు. నగరపాలక సంస్థలో శానిటేషన్, ఇంజనీరింగ్ సెక్షన్‌లో 41 మంది కార్మికులు ఉద్యోగ విరమణ చేశారని పేర్కొన్నారు. వీరి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఎన్నో ఏళ్ల నుంచి కోరుతున్నా అధికారులు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీలో ఉద్యోగాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. కడప కమిషనర్‌ను ఉద్యోగాలు ఇవ్వాలని కోరితే రోస్టర్ ప్రకారంఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రిటైర్డ్ అయిన కార్మికుల వారసులు అడిషనల్ కార్మికులుగా పనిచేస్తూ ఉన్నారని, వీరికి నాలుగు నెలల నుంచి ఎలాంటి వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. కమిషనర్ కొంతమంది అధికారులు చెప్పినట్లు వెళుతూ ఉన్నారని, ఇది సరి కాదని అభిప్రాయపడ్డారు. కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ కూడా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15 నుంచి కార్పొరేషన్ ఎదుట మృతిచెందిన, రిటైర్డ్‌అయిన కుటుంబాలతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్, సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్, నగర కమిటీ సభ్యులు నాగరాజు, మహిళా కమిటీ సభ్యురాలు పెంచలమ్మ, డ్రైవర్స్ కమిటీ కార్యదర్శి సుంకర కిరణ్, మృతుల, రిటైర్డ్ కార్మికుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - కడప : కడప పట్టణంలో విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణలో భాగంగా ఈనెల 13న శనివారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని కడప టౌన్ 2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మ నాయక్ తెలిపారు. ముత్రాస్ పల్లి, రెడ్డి కాలనీ, పకీరుపల్లి, ఓం శాంతి నగర్, అబ్దుల్ కలాం కాలనీ, చిన్న చౌక్ విద్యా మందిర్ స్కూల్, భాగ్యనగర్ కాలనీ, దేవుని కడప, గౌస్ నగర్, నిర్మల స్కూల్, మాచుపల్లి రోడ్డు, మాసాపేట, నమస్తే బోర్డు, భారతి భార్, ద్వారకా నగర్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి, సిపి బ్రౌన్, మున్సిపల్ ఆఫీసు, ఆర్‌టిసిబస్టాండు, పటేల్ రోడ్డు, అరవింద్ నగర్, తేజ పెట్రోల్ బంకు, తదితర ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని కడప టౌన్ 2 సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. లక్ష్మా నాయక్ తెలియజేశారు. వినియోగదారులకు కలిగే ఈ విద్యుత్ అంతరాయానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. **పులివెందుల టౌన్ :** విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఎఇ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సబ్ స్టేషన్ల పరిధిలలో మరమ్మతులు చేపట్టనున్నండంతో శనివారం ఉదయం. 9 గంటల నుండి 12 గంటల వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. వినియోగదారులు సహకరించాలని ఎఇ కోరారు.

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

వైఎస్ఆర్ కడపజిల్లా ఎపిఎన్ జిజిఒ జిల్లా నూతన అధ్యక్షులు బి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి పి.నిత్యపూజయ్య, జిల్లా కోశాధికారి టి. శ్రీనివాసులు, జిల్లా సంయుక్త కార్యదర్శి డి. పద్మనాభం శుక్రవారం విజయవాడలోని ఎన్ జిజిఒ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్‌ని, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి. రమణ ని మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కడప అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్య వర్గ సభ్యులను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్‌యాదవ్, నాయకులు డి.రవికుమార్, సత్య నారాయణ రెడ్డి, సచివాలయ అధ్యక్షులు జానీ బాషా పాల్గొన్నారు.



నూతన అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు



రోడ్డుకు అడ్డంగా ఉన్న మట్టి

కాలువ తీశారు.. మట్టిని వదిలేశారు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఎప్పుడు రద్దీ ఉండే ప్రాంతం. అలాంటి ప్రాంతంలో రోడ్డుపై మట్టి ఉన్నప్పటికీ పంచాయతీ అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రయాణికులు, వాహనదారులకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక పులివెందుల రోడ్డులో నిర్మించిన డ్రైనేజీ కాలువ పనులు మధ్యలోనే ఆపి వేయడంతో నాలుగు రోడ్ల కూడలిలో డ్రైనేజీ పనులు చేపట్టలేదు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ కాలువలలోని మురుగునీరు అంతా నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డుపై ప్రవహిస్తుండడంతో పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు, తోపుడు బండ్ల వ్యాపారులు చాలా ఇబ్బందులు పడేవారు. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు నీరు పాదచారులపై పడుతుండడంతో ప్రజల ఫిర్యాదు మేరకు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు కాలువను ఏర్పాటు చేశారు. కాలువ తీసిన మట్టిని రోడ్డుపైనే వేశారు. దాదాపు 15 రోజులు కావస్తున్న రోడ్డుపై ఉన్న మట్టిని ఎత్తకుండా వదిలేశారు. రోజూ మండలంలోని ఆయా శాఖల అధికారులతో పాటు పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు మేరకు రోడ్డుపై మట్టి పట్టనట్లు మౌనంగా ఉండడంతో వాహనదారులపైనా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై ఉన్న మట్టి ట్రాఫిక్‌కు కూడా అంతరాయంగా మారింది. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డుపై ఉన్న మట్టిని లేకుండా చేసేందుకు చర్యలు తీసుకొని ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అక్షరాస్యత కంటే విలువైన సంపద లేదు

ప్రజాశక్తి - వేంపల్లె : అక్షరాస్యత కంటే విలువైన సంపద మరొకటి లేదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాలకు సంబంధించి ముగింపు వేడుకలను శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఉన్న సంపదలన్నింటికంటే అక్షరాస్యత చాలా విలువైందని చెప్పారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ అక్షరాస్యతలో సంపూర్ణత సాధించే దిశగా విద్యార్థులు ప్రయత్నం చేయాలని కోరారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్. నాగలక్ష్మి దేవి, కిరణ్మయి, డాక్టర్ రామకృష్ణ, తేజేంద్ర, వినోద్ కుమార్, ప్రసాద్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఐఆర్ వెంటనే ప్రకటించాలి

ప్రజాశక్తి - చాపాడు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు పెన్షనర్లకు కరువుభత్యం, మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎపిటిఎఫ్ రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా మండల తహశీల్దార్ కార్యాలయం ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుండి పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డిఎలను వెంటనే ప్రకటించాలని, సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డిఎస్‌సి వారికి మెమో 57 ప్రకారం పాతపెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని, 12వ పిఆర్‌సి కమిషనును వెంటనే నియమించాలని చెప్పారు. 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలన్నారు. ప్రధాన డిమాండ్లతో ఈ నెల 11నుంచి 17 వరకు ఎపిటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు రాజారెడ్డి, మల్లికార్జన, జిల్లాకౌన్సిలర్లు అప్సర్ పాషా, కొండారెడ్డి, కృష్ణయ్య, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎంలో మహిళల ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 'హ్యాపీ యూటరస్ అండ్ హెల్తీ పీరియడ్స్' అంశంపై మహిళల ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఎస్.జె. సెమినార్ హాల్‌లో విజయవంతంగా నిర్వహించారు. విద్యార్థినులు, మహిళా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిఇఎస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పీడియాట్రిక్స్ విభాగంలో పనిచేస్తున్న కె. జయశ్రీ, ఫెమీ9 గ్రూప్‌కు చెందిన మెన్‌స్ట్రువల్ హైజీన్ ఎడ్యుకేటర్ ఎం.అనంత్ విద్యార్థినులకు విలువైన సమాచారం అందించారు. యాంటీ-సెక్సువల్ హరాస్‌మెంట్ సెల్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, హెల్త్ క్లబ్ అండ్ స్టూడెంట్ యాక్టివిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మహిళల రుతుకాలం, ఆరోగ్య పరిశుభ్రత గురించి వివరణాత్మక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్.ప్రసాద్, విభాగాధిపతి డాక్టర్ రామచంద్ర రెడ్డి, ప్రొఫెసర్ జి.రాధ, ఎస్. షర్మిళ బాను, కె. నివేదిత, బి. మనోరమ దేవి పాల్గొన్నారు.

కుమారస్వామి గుప్తాకు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జియుకెటి పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్‌గా పని చేస్తున్న కుమార స్వామి గుప్తాకు ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఒంగోలు ట్రిపుల్ ఐటి ఇన్‌ఛార్జ్ డైరెక్టర్‌గా కుమార స్వామి గుప్తాకు అదనపు బాధ్యతలు అప్పగిస్తు ఆర్‌జియుకెటి వైస్ ఛాన్సలర్ మధుమూర్తి, రిజిస్ట్రార్ అమరేంద్ర సంద్ర ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఒంగోలు ట్రిపుల్ ఐటికి ఇన్‌ఛార్జి డైరెక్టర్‌గా ఆయన కొనసాగుతున్నారని అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

భవనంపై నుంచి కింద పడి కార్మికుడు మృతి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల



జాను (ఫైల్‌ఫోటో)

పట్టణంలోని కడప రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవంతిలో నాలుగు అంతస్తుల పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి కార్మికుడు మృతిచెందాడు. వివరాలు.. కడప రోడ్డులో ఒక భవంతి నిర్మాణానికి బాబయ్య అనే వ్యక్తి కాంట్రాక్టు తీసుకున్నాడు. బాబయ్య వద్దకు దినసరి కూలీగా జాను (22) పనిచేస్తున్నాడు. శుక్రవారం నాలుగు అంతస్థుల పైన పని చేస్తుండగా మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ప్రమాదంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

8 మంది జూదరులు అరెస్టు

- రూ.82 వేలు నగదు స్వాధీనం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గండి - పులివెందుల బైపాస్ రోడ్డు సమీపంలో జూదం ఆడుతున్న 8 మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం సిఐ నరసింహులు ఆదేశాల మేరకు గండి - పులివెందుల బైపాస్ రోడ్డు సమీపంలో పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఐ తిరుపాల్ నాయక్ తన సిబ్బందితో దాడులు చేశారు. దీంతో వెంకట రమణతో పాటు మరో ఏడుగురిని అరెస్టు అదుపులోకి తీసుకొన్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.82,300 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- పడకేసిన పారిశుధ్యం
- పట్టణం, పల్లెల్లో దోమల బెడద
- నివారణకు చర్యలు శూన్యం
- కిక్కిరిసిన ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులు
- పట్టని అధికారులు



ఆస్పత్రిలో క్యూకట్టిన రోగులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

15 రోజుల కిందట కురిసిన వర్షాలకు, ఈదురు గాలులకు వైరల్ జ్వరాలు నియోజకవర్గంలో విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. చుట్టుపక్కల మండలాల నుంచి ప్రభుత్వ వైద్యశాలకు అధిక సంఖ్యలో రోగులు వస్తున్నారు. ముఖ్యంగా జమ్మలమడుగు పట్టణంలో ఉన్న వారు వైరల్ జ్వరాలతో అల్లాడిపోతున్నారు. ఇటీవల కురుసిన వర్షాలకు దోమలు అధికామయ్యాయి. మున్సిపాల్టీలోని ప్రయివేట్ వ్యక్తుల ఇళ్లల్లో, స్థలాలో చెట్లు, పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడం, మురుగు నీరు నిల్వ ఉండటం, చెత్తా చెదారం ఎక్కడపిడితే అక్కడే ఉండడంతో దోమల బెడద అధికమైంది. ఇక గ్రామాలలో ఇళ్ల పక్కనే పశువుల పేడ, దుబ్బలు ఉండటంతో అక్కడా దోమలు విలయతాండవం చేస్తున్నాయి. వాటి నివారణకు మున్సిపల్ అధికారులు ఫాగింగ్ చేయడం కానీ, లేక మురుగు లేదా బురద ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ చల్లడం కానీ చేయడంలేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో మహిళలు లేచి వివరించారు. చిన్న పిల్లలు ఎక్కువగా దగ్గు, జలుబు, మలేరియా, టైఫాయిడ్‌లతో పాటు వైరల్ ఫీవర్ ఎక్కువగా ఉన్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో సోమ, మంగళ, బుధవారం రోజులల్లో 600 నుంచి 700 టోకెన్స్ కు తగ్గడం లేదు. డాక్టర్స్ కూడా నిదానంగా చూస్తూ రక్త పరీక్షకు రాసిస్తున్నారని ఎక్కువగా మలేరియా, టైఫాయిడ్ ఉన్నాయని పిల్లల్లో జలుబుతో కూడిన జ్వరం, రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

ఆర్ఎంపి వైద్యులు జ్వరాలను ఆసరా చేసుకుని సామాన్యుని ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇటీవల ఓ ప్రయివేట్ పాఠశాలలో చదివే ఇద్దరు విద్యార్థులను వారి తల్లిదండ్రులు పెద్దపసుపల మోటు వద్ద ఉన్న ఆర్ంఎపి వైద్యునికి వద్దకు వెళ్లి తల నస్తుంది అని చెబితే ఆయన నాడి పట్టుకొని జ్వరం ఎన్నిరోజుల నుంచి వస్తుందని అడిగి రక్త పరీక్షకు పంపకుండానే మలేరియా, టైఫాయిడ్, అని చెప్పి రూ. 3 వేల నుంచి రూ. 4 వరకు వసూలు చేసినట్లు సమాచారం. కొంత ఆర్థికంగా కుదుట పడిన వారు జమ్మలమడుగు ప్రయివేట్ ఆసుపత్రులకు, ప్రొద్దుటూరుకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారు. సామాన్యుడు, పేద వాడు అటు ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఆర్ఎంపిల వద్దకు వెళ్తున్నాడు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పారిశుధ్యంపై చర్యలు తీసుకుని జ్వరాల బెడదను నియంత్రించాలని కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ఉల్లిని కొనుగోలు చేయాలి

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా ఉల్లిని క్వింటా రూ 3 వేలతో కొనుగోలు చేయాలని పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి, పులివెందుల సమన్వయ కర్త ధృవకుమార్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లె గ్రామ పోలంలో గంగిరెడ్డి అనే రైతు సాగు చేసిన ఉల్లి పంటను కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. రైతులతో పంట దిగుబడి, గిట్టుబాటు ధరపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు లేనిదే రాజ్యం లేదన్నారు. రైతు ఏడ్చిన రాజ్యం, ఎద్దు ఈడ్చని సేద్యం బాగుపడవని కాబట్టి వ్యవసాయం పండుగ కావాలని చెప్పారు. . వ్యవసాయం దండుగ అనే వాతావరణం ఏర్పడిందని వారు వాపోయారు. వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు కాబట్టి రైతులు పండించిన ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని చెప్పారు. పొగాకు, మిర్చి, మామిడి ,చీనీ ,అరటి ,పసుపు, టమోటా, ఉల్లి ఇలా ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదని తెలిపారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా ప్రభుత్వం రంగంలోకి దిగి రైతులను ఆదుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉందే తప్ప రైతులను ఆదుకొనేందుకు మాత్రం ముందుకు రావడం లేదని మండిపడ్డారు ఒకవేళ కొన్నా అది కంటి తుడుపు చర్య మాత్రమే అన్నారు. ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారని,అలాంటిది ఉల్లి పండించే రైతులు తల్లడిల్లి పోతున్నట్లు చెప్పారు. క్వింటా రూ 600 వందల నుండి రూ 800 వందలకే అడుగుతున్నారని రైతులు తమ దృష్టికి తెచ్చారని చెప్పారు. ఉల్లి రైతుకు గిట్టుబాటు కాక పోవడంతో పాటు కూలీలకు ఇచ్చేందుకు కూలి డబ్బులు కూడ రావడం లేదని చెప్పారు. రైతులు చేతికి వచ్చిన ఉల్లి పంటను పొలాల్లోనే గొర్రెలకు ,బర్రెలకు వదిలి పెడుతున్నట్లు చెప్పారు. ఉల్లి రైతులను నిజంగా ఆదుకోవాలన్నా చిత్తశుద్ధి కూటమి ప్రభుత్వానికి ఉంటే క్వింటా రూ 3వేలు చొప్పున రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పులివెందుల అసెంబ్లీ నియోజకవర్గంలో శీతల గడ్డంగిని, ఆగ్రో ప్రాసెసింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రహ్మణ్యం, చక్రాయపేట మండల శాఖ అధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, చిన్నకోట్ల నాగరాజు, బండారు వెంకటేష్, వినయ్, బద్రి, రాఘవయ్య, ఉల్లి రైతులు గంగిరెడ్డి, అయ్యవారయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - దువ్వూరు

ఆర్థిక నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకొని, జాగ్రత్త వహించాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి విజయ విహారి పిలుపునిచ్చారు. భీమునిపాడు గ్రామంలో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో రిజర్వు బ్యాంకు వారి సౌజన్య తో శుక్రవారం డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ బ్యాంకు ఖాతాలు ఎప్పటికప్పుడూ అప్డేట్ చేసుకోవాలని సూచించారు. బ్యాంకు ఖాతాలు అప్డేట్‌లో ఉంటే సామాజిక వ్యక్తిగత భద్రత కూడా వర్తిస్తుందని తెలిపారు. అధిక వడ్డీలకు ఆశపడి మోసపోవద్దని వారు హెచ్చరించారు. రిజర్వు బ్యాంకు ద్వారా గ్రామాలలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ సందర్భంగా హెడ్స్ సంస్థ ముద్రించిన కరపత్రాలను బ్రోచర్లు వారు ఆవిష్కరించారు. రాట కళాబృందం వారి కళాజాత, మ్యాజిక్‌షో అధికారులను, ప్రజలను ఆకర్షించాయి. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పి.జనార్ధనం, సర్పంచ్ రామకృష్ణారెడ్డి హెడ్స్ సంస్థ అధ్యక్షులు పెరుగు కృష్ణయ్య యాదవ్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె. ఉదయకుమార్, వెలుగు సిసి సుబ్బరాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నిరుద్యోగ యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మైలవరం ఎంపిడిఒ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మైలవరం మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో జిల్లా గ్రామీనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఆల్ డిక్షన్, సీడ్ ఎపి అనే కంపెనీలు వచ్చాయని తెలిపారు. ఇంటర్వ్యూలకు మండలంలోని 70 మంది హాజరయ్యారని, వారిలో 55 మందిని ఆయా కంపెనీలు ఎంపిక చేసుకున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆయా కంపెనీల ప్రతినిధులు ఆనంద్, అనిల్‌రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, వెంకట సుబ్బమ్మ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి -వల్లూరు

మండలంలోని లింగాయపల్లి గ్రామానికి చెందిన గంగమ్మకు మండల టిడిపి అధ్యక్షులు, సొసైటీ బ్యాంక్ చైర్మన్ లేబాక నాగేశ్వర్ రెడ్డి చేతులు మీదుగా శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మనం.. మన గ్రామం సేవ సమితి సభ్యుల ఆధ్వర్యంలో మండలంలోని అక్షింతల ఒబాయపల్లి గ్రామానికి చెందిన టకోలి సుబ్బారెడ్డి సతీమణి కీర్తిశేషులు టక్కోలి కొండమ్మ ఐదవ వర్ధంతి సందర్భంగా వారి పెద్ద మనవడు సురేష్ కుమార్ రెడ్డి సహకారంతో సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పేదరికంతో బాధపడుతున్న గంగమ్మకు అండగా నిలవడం చాలా సంతోషకరంగా ఉందని చెప్పారు. మనం మన గ్రామ సేవా సమితి ఇలాంటి కార్యక్రమాలు చేయడం మండలంలో పేద కుటుంబాన్ని ఆదుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమం ప్రతినెలా మండలంలోని ఒక పేద కుటుంబానికి అండగా నిలుస్తామని సేవాసమితి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఆంజనేయులు, మనం మన గ్రామం సేవ సభ్యులు పెంచల్ రెడ్డి, వెంకటేష్ రెడ్డి , సౌజన్య రెడ్డి , యుగేందర్ రెడ్డి, వేద రెడ్డి పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని ఎరువుల దుకాణాలను శుక్రవారం సిఐ దస్తగిరి, వ్యవసాయ శాఖ ఎడిఎ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భ:గా వారు మాట్లాడుతూ రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతి పొందిన నాణ్యమైన ఉత్పత్తులు మాత్రమే విక్రయించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా అమ్మాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్స్ రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



జలమయమైన రోడ్డు

జమ్మలమడుగులో భారీ వర్షం

- భవనంపై పడిన పిడుగు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్‌టిసి బస్టాండ్, మూడు రోడ్ల కూడలి, ఎంపిడిఒకార్యాలయం ఆవరణంలోకి వర్షపు నీరు చేరాయి. దిగువ పట్టణం కాలనీలో ఆర్ఎంపి డాక్టర్ మంగదొడ్డి జకరయ్యకు చెందిన కొత్త భవనంపై పిడుగు పడింది. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. సంఘటనలో కొత్త భవనం స్లాబ్, పిఒపి పూర్తిగా దెబ్బతింది. పిడుగుపాటుకు దిగువపట్టణం కాలనీలో చుట్టుపక్కల ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లు, వీధి బల్బులు పూర్తిగా కాలిపోయాయి. వాతావరణ శాఖ అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎగ్జిబిషన్ వేలం ఆదాయం రూ.1.91 కోట్లు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన ఎగ్జిబిషన్ వేలంపాటలో రూ.1,91,44,000 ఆదాయం వచ్చిందని మున్సిపాల్టీ అధికారులు పేర్కొన్నారు. ఎన్. శివకుమార్ అనే వ్యకర్తి దక్కించుకున్నారని తెలిపారు. ఈ వేలం పాట తొలుత 11 గంటలకు ప్రారంభం కాగా చిన్నపాటి రభస చోటు చేసుకోవడంతో మధ్యాహ్నానికి వాయిదా వేశారు. ఈ వేలం పాటలో బాక్స్ టెండర్లలో ఐదుగురు తమ మొత్తాన్ని కోడ్ చేయగా అత్యధికంగా ఎన్. శివకుమార్ వేలంపాటను దక్కించుకున్నారు.

ఎంఇఒ-1గా మహమ్మద్ షఫీ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కాశినాయన

ఎంఇఒ-1గా షేక్. మహ్మద్ షఫీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి లోటుపాట్లపై ఆరాతీస్తామని చెప్పారు. పిల్లలకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నివేళలా అందుబాటులో ఉంటూ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అందుకునేలా కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంఇఒ-2 నిర్మల, రెడ్డి కొట్టాల హెడ్మాస్టర్ వాకా చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ, జోజి పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలను గుర్తించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

టిడిపి కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలను గుర్తించాలని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, ఎల్ బిఆర్ భాస్కర్ రెడ్డిలు కోరారు. శుక్రవారం కడపలో ఉన్న టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనువాసులరెడ్డిని ఎ వేంపల్లెకు చెందిన టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, ఎల్ బిఆర్ భాస్కర్ రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్, దొంతు సుబ్బారావు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. టిడిపి కోసం పని చేసిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు సహకరించాలని కోరారు. అనామినేటెడ్ పదవులు కూడ కల్పించేందుకు టిడిపి అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వేంపల్లెలో పలు సమస్యలున్నాయని పరిష్కారం చేసేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను గుర్తించి న్యాయం చేస్తామని జిల్లా అధ్యక్షుడు శ్రీనువాసులు రెడ్డి తెలిపినట్లు వారు పేర్కొన్నారు. సీనియర్ నాయకులకు నామినేటెడ్ పదవులు వరించేలా పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటరమణయ్య.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

మండలంలోని చిలంకూరులో పారిశుధ్యం అధ్వానంగా తయారయిందని, దీంతో గ్రామంలో ప్రతి ఇంటిలో ఒకరికి జ్వరం వచ్చిందని స్థానిక ఎంపిటిసి కొండయ్య సర్వసభ్య సమావేశం సభలో తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. దోమలమందు పిచికారి చేయాలని, బీజింగ్ పౌడర్ చల్లాలని పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదని, వారి పరిస్థితి ఇబ్బంది కరంగా ఉందని వెంటనే వేతనాలు ఇవ్వాలని కోరారు. విద్యుత్ లైన్లు చాలా పాతది కావడం వల్ల సమస్య చాలా ఎక్కువగా ఉందని, రోజూ లైన్లకు సంబంధించిన వైర్‌లు గ్రామంలో ఎక్కడో ఒక చోట తెగిపోతున్నాయే ఉన్నాయని సభలో విద్యుత్ ఎఇ దృష్టికి తెచ్చారు. పొట్లదుర్తి ఎంపిటిసి రమణారెడ్డి మాట్లాడుతూ డ్రెయినేజీ నీరు తాగునీటి పైప్ లైన్‌లలో వస్తున్నాయని, కలుషితమైన నీటిని తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు ఎంపిడిఒ వెంకటరమణయ్య స్పందిస్తూ సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాలలో పారిశుధ్య సమస్యలను ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి బాలయ్య, ఉప మండల అధ్యక్షుడు వెంకట మోహన్ రెడ్డి, వైద్యాధికారి జ్యోత్స్న, ఎంఇఒ శివప్రసాద్ ఎఒ సుజన, ఎపిఒ గంగాభవాని, ఎపిఎం జగదీశ్వరి, అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె : ఆయా ప్రాంతాల్లో పారిశుధ్యం పనులు చేపట్టి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని టిడిపి మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి కోరారు. పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నాగభూషణంరెడ్డిని శుక్రవారం టిడిపి మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, శివ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మైనార్టీ, టిడిపి నేతలు కలిసి శాలువతో సన్మానం చేశారు. పంచాయతీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ కూడ సక్రమంగా లేదని కాబట్టి కాలువలు పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించాలని కోరారు. కాలువల్లో చెత్త పెరకపోవడంతో రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుందని శుభ్రం చేసి మురుగు నీరు రోడ్డుపై ప్రవహించకుండా చూడాలని కోరారు. వైసిపికి చెందిన ఎంపిటిసి భారతి, బాబా షరీఫ్, అసనయ్య, బండల షకూర్, కటిక చంద్రశేఖర్ కూడ కలిసి శాలువతో సత్కరించారు. పంచాయతీ కార్యదర్శిని కలిసిన వారిలో టిడిపి నేతలు పీరా సాహెబ్, ఫ యాజ్, ఈశ్వరయ్య, తక్కెల షరీఫ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలను నిర్వహించారు. శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో 8వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులకు 'కర్తవ్యం దైవం' అనే అంశంపై వ్యాసరచన పోటీలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆయా పాఠశాలలో చదివే విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా స్థాయి అనంతరం రాష్ట్రస్థాయి విజేతలను ఎంపిక చేస్తారని శ్రీ సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధి సాయినాథ్ తెలిపారు. నవంబర్ నెలలో రాష్ట్రస్థాయిలో వ్యాసరచన పోటీలు ఉంటాయని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకంతోపాటు ప్రశంసా పత్రాలు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలోశ్రీ సత్య సాయి సేవ సంస్థల ప్రతినిధులు గోవర్ధన్, కుమార్, శివ కిరణ్, పద్మావతి, ముని కుమారి, పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దోమకాటు ఆరోగ్యానికి చేటని వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్ అన్నారు. పులివెందుల అర్బన్ పరిధిలోని ఎస్‌బిఐ కాలనీ ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర స్కూలను శుక్రవారం వైద్యాధికారి డాక్టర్ శాంతి కుమార్ సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. దోమకాటు వల్ల వచ్చే వ్యాదుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగ్యూ చికెన్ గునియా, బోదకాలు, మెదడు వాపు వ్యాధి మొదలగునవి వస్తాయని దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవాల అన్నారు. ప్రతి ఒక్కరూ రాత్రి సమయంలో తప్పకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి సతీష్ కుమార్, ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, ప్రశాంతి, ప్రిన్సిపాల్ రవికాంత్, ఆశా కార్యకర్త శిరీష పాల్గొన్నారు.

ఎస్ఐకి సత్కారం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక ఎస్ఐ తిరుపాల్ నాయక్ ను ఎంహెచ్ పిఎస్ కమిటీ సభ్యులు కలిసి సత్కరించారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ తిరుపాల్ నాయక్‌ను పులివెందుల నియో జకవర్గం ఎంహెచ్ పిఎస్ కమిటీ అధ్యక్షులు మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్ఐ శాలువతో సత్కరించారు. యువత చెడు అలవాట్లు వైపు వెళ్ళ కుండా వారికి అవగాహన కల్పించే బాధ్యత ఎంహెచ్ పిఎస్ సభ్యులు తీసుకోవాలని ఎస్ఐ కోరారు. చాలా మంది యువత చెడు అలవాట్లు వైపు వెళ్లుతున్నారని వారందరిని గుర్తించి అధ్యాత్మిక వైపు నడిచేలాగా హిత బోధ చేయాలని కోరారు. మోటర్ బైకులో అతి స్పీడ్‌గా అటు ఇటు తిరుగుతున్నారని అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. చెడు అలవాట్లుతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని యువత అ వైపు వెళ్లకుండా ఉండేందుకు పిఎస్ సభ్యులు ప్రత్యేక చోరవ తీసుకోవాలని కోరారు. ఎలాంటి సమస్యలు ఉన్న ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని ఎస్ఐ వారికి హామీ ఇచ్చారు